

# నవభూమి కరీంనగర్

అనుబంధం

09 నవంబర్,2024 శనివారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


## బీసీల అభ్యున్నతికి డెడికేషన్ కమిటీ ఏర్పాటు

# హర్షణీయం



**జగిత్యాల -నవభూమి:** సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుతనానికి గురైన బీసీలకు రాజ్యాంగబద్ధంగా కల్పించాల్సిన రిజర్వేషన్ సౌకర్యాల కోసం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలహీన వర్గాల అభ్యున్నతిలో భాగంగా రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం డెడికేషన్ కమిటీ వేసిందన్నారు. బలహీనవర్గాలకు స్థానికసంస్థల్లో రిజర్వేషన్ల కల్పనకు ఉమ్మడి రాష్ట్రంలోనే చట్టం రూపొందించారన్నారు. 2004లో యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆలోచనలకు అనుగుణంగా అల్పసంఖ్యాక వర్గాలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. బలహీనవర్గాల న్యాయం చేయాలనే తలంపుతోనే రాహుల్ గాంధీ వివరాలు సేకరించేందుకు సర్వే చేయాలని ఆదేశించారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లోనే కులగణన అంశం ప్రస్తావించడంతో ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సర్వేతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎంకు లేఖ రాశానని అందులో సర్వే చేసే రోజు సమాచారం ఉండేలా చూడాలని కోరానన్నారు. కొందరికి ఇంటి నంబర్లు లేక బయట గుడిసెలు వేసుకోని ఉన్నారని, కొందరు సంచార జాతులు కూడా ఉన్నారని అలాంటి వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించి స్పష్టమైన వివరాలు సేకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సర్వేకు ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే నేటికీ బహిర్గతం కాలేదన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకత, చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. పనిచేసే ప్రభుత్వంపై అక్కసుతోనే ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సహజం అన్నారు. నవంబరు నెలలోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, గ్రామసభల ద్వారా అర్హులను ఎంపిక చేసి నిర్ణయం తీసుకుంటారన్నారు. సర్వేపై ప్రజలు ఆపోహలు, ఆందోళన చెందవద్దన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, మండల బ్లాక్ ప్రెసిడెంట్ నందయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, మాజీ ఎంపీపీ రమేష్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేంధర్, పుప్పాల అశోక్, నాయకులు నెహాల్, చాంద్‌పాషా, గుండామధు, విజయ్, మహేష్ తదితరులున్నారు.

## నిర్మాణాత్మక సమావేశాలు జరిగేనా?




## నవంబర్ 10 నుండి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటలకు

# తప్పక చూడండి!




**కరీంనగర్, నవంబర్ 08 (నవభూమి):** విజయవంతంగా కొనసాగుతున్న జీ తెలుగు సింగింగ్ షో సరిగమప సీజన్ 16 – ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ ప్రత్యేక ఎపిసోడ్స్తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రారంభం నుంచీ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మ్యూజికల్ రియాలిటీ షో సరిగమప సీజన్ 16 నవంబర్ 10 నుండి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి 10 గంటల వరకు ప్రసారం కానుంది. ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ సీజన్కి సంగీత దిగ్గజాలు కోటి, ఎస్పీ శైలజ, కాసర్ల శ్యామ్తో ఈ సీజన్ ఉత్తేజకరమైన ప్రదర్శనలు, మనసును హత్తుకునే పాటలతో సంగీత ప్రియులకు మరింత వినోదం పంచబోతోంది. ప్రతి కంటెస్టెంట్ తమ ఆకట్టుకునే ప్రదర్శనలతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్గా మారుతున్నారు. ఔత్సాహిక గాయకులు తదుపరి సింగింగ్ సెన్సేషన్ టైటిల్ కోసం పోటీ పడుతుండటంతో థ్రిల్లింగ్ కాంపిటీషన్లు, మరచిపోలేని క్షణాలను అందిస్తూ ప్రతి వీకెండ్ను మరింత స్పెషల్ చేస్తోంది. ఆదివారం అంతులేని వినోదం అందించే ఉద్దేశంతో జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రసార సమయాన్ని మరింత పెంచింది. శ్రోతల మనసును తాకే సంగీతంతోపాటు చక్కని వినోదం అందించే లక్ష్యంతో వస్తున్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటలకు, తప్పక చూడండి!సంగీత ప్రియులకు జీ తెలుగు కానుక.. సరిగమప సీజన్ 16 ఈ ఆదివారం నుండి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటలకు, మిస్ కాకండి!

## సమావేశాలతోనే సరి..సమస్యల పరిష్కారమేది?



## ఆపదలో ఆదుకుంటూ.. అవగాహన కల్పిస్తూ!






**కరీంనగర్-నవభూమి:** కరీంనగర్ రెండో ఠాణా పరిధిలో నివాసం ఉంటున్న ఓ యువకుడు నగరానికి చెందిన ఓ యువతితో సామాజిక మాధ్యమంలో పరిచయం పెంచుకున్నాడు.ఆమె వ్యక్తిగత సమాచారం రాబట్టుకొని.. సదరు యువతి చిత్రాల మార్ఫింగ్‌తో డబ్బులు రాబట్టడానికి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు షీటీంను ఆశ్రయించగా ఆ వేదిక ఐడీ ఆధారంగా ఆ యువకుడిని పట్టుకున్నారు. కేసు నమోదుచేసి జైలుకు తరలించారు. ఈ మధ్యకాలంలో ఇలాంటి సంఘటనలు తరచూ వెలుగు చూస్తుండటంతో సామాజిక మాధ్యమాలలో అప్రమత్తంగా ఉండాలంటూ షీటీం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.మూడేళ్లలో 188 మందిపై..అత్యవసర సమయంలో బాధితులను ఆదుకునేందుకు పోలీస్‌శాఖ డయల్ 100ను సంప్రదించాలని సూచిస్తుంది. కానీ విద్యార్థినులు, మహిళలు వారికి జరిగిన అన్యాయంపై కొన్ని కారణాలవల్ల ముందుకు రావడంలేదు. దీంతో వారి సమస్యలను నేరుగా తెలుసుకొని నిందితులను జైలుకు పంపిస్తున్నారు. గత మూడేళ్లలో 388 ఫిర్యాదులు అందగా.. 188 మందిపై కేసులు నమోదు చేశారు. మరో 238 మందికి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించారు.షీటీం రూపొందించిన లోగోతో సీపీ అభిషేక్ మహంతి ఇతర అధికారులు బృందాల నిఘా కరీంనగర్ పరిధిలో షీటీంను ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. నెలవారీగా అదనపు డీజీ స్థాయి అధికారి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఘటనలపై సమీక్షిస్తూనే.. తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేస్తుంటారు. నగరానికి చెందిన షీటీం సిబ్బంది.. సేవలలో పలు అవార్డులను సైతం సొంతం చేసుకొంది. ప్రత్యేక నిఘాతో ఆకతాయిల ఆట కట్టిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు మైక్రో కెమెరాలను వినియోగించి కదలికలను గుర్తిస్తున్నారు.

## ఆసక్తి చూపని పట్టభద్రులు

**కరీంనగర్-నవభూమి:** ఓటు హక్కు కోసం పేర్లు నమోదు చేసుకోవడంలో,ఆ హక్కును వినియోగించుకోవడంలో చదువుకున్న వారికంటే గ్రామీణ ప్రాంత సాధారణ పౌరులే మిన్న అని మరోసారి రుజువైంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే మార్చినెలలో జరుగనున్నాయి. ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబరు 30 నుంచి నవంబర్ 6వ రకు ఈనాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులను ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ కోరింది.10 లక్షలకుపైగా పట్టభద్రులు ఉంటారని అంచనా వేశారు.రాజకీయంగా అత్యధిక చైతన్యం ఉన్న ఈ జిల్లాల్లో పట్టభద్రులు పెద్ద ఎత్తున ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటారని, ఈసారి హోరాహోరీ పోటీ ఉంటుందని అందరూ భావించారు.అవగాహన కల్పించినా..ఎన్నికల కమిషన్ ఓటు హక్కు నమోదు కోసం షెడ్యూల్ విడుదల చేయక ముందు రెండు నెలల నుంచే పోటీ చేయాలని భావిస్తున్న వారు నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పర్యటించి సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి పట్టభద్రులను కలిశారు. స్వయంగా ఆశావహులే ఓటర్ల నమోదు పత్రాలతో ఊరూరా దరఖాస్తుల సేకరణ స్వయంగా చేపట్టారు. మిస్‌కాల్ ఇస్తే చాలు.. మీ ఇంటికే మా సిబ్బంది వచ్చి దరఖాస్తు ఫారంతోపాటు అవసరమైన డాక్యుమెంట్లను సేకరించి ఓటరుగా నమోదు చేపిస్తారని సోషల్ మీడియాలో, హోర్డింగ్‌లతో విస్తృతంగా ప్రచారం చేశారు.

# నిర్మాణాత్మక సమావేశాలు జరిగేనా



**గోదావరిఖని-నవభూమి:** సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి దాదాపుగా ఏడాది కావస్తోంది. గత ఏడాది డిసెంబరు 28న ఎన్నికలు జరిగాయి.ఇందులో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్టీయూసీలు గెలుపొందాయి. ఇప్పటి వరకు కార్మికుల సమస్యలపై నిర్మాణాత్మక, జేసీసీ సమావేశాల ఊసే లేదు. దీంతో కార్మికుల సమస్యలపై కదలిక లేకుండా పోయింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం ద్వారా కార్మికుల సమస్యలను అందులో ప్రస్తావించే అవకాశం ఉంటుంది. జేసీసీ సమావేశాలు నిర్వహిస్తే అందులో మరికొన్ని సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకురావచ్చు. నిర్మాణాత్మక సమావేశంలో గుర్తింపు సంఘం, యాజమాన్యం ప్రతినిధులు, జేసీసీ సమావేశంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు, యాజమాన్యం నుంచి అధికారులు పాల్గొంటారు. ఇరు పక్షాల సమక్షంలో ప్రతి సమస్యను చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. కాగా ఇప్పటి వరకు దానిపై ఎలాంటి కదలిక కనిపించడం లేదు. ఇది వరకే గుర్తింపు సంఘం నాయకులు నిర్మాణాత్మక సమావేశాలు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు.ఆలస్యంగా అధికారిక పత్రాలు సింగరేణిలో గెలిచిన సంఘాలకు ఆలస్యంగా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల పత్రాలను అందజేశారు. దీనికోసం తొమ్మిది నెలల పాటు వేచి చూడాల్సి వచ్చింది. సెప్టెంబరు 9న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు అధికారిక పత్రాలు అందజేయగా.. ప్రస్తుతం రెండు నెలలు కావస్తున్నా నిర్మాణాత్మక సమావేశాల దృష్టికి వెళ్లడం లేదు. దీంతో కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పరిష్కారం లభించడం లేదు. సింగరేణి ఉన్నతాధికారులు కూడా వీటిపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఇవీ కార్మికుల సమస్యలు భూగర్భ గనుల్లోని పని స్థలాల్లో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటిలేషన్‌తో పాటు పని స్థలాల్లో సౌకర్యాలు లేకుండా పోయాయి.పెండింగ్‌లో ఉన్న కేడర్‌స్కీం పదోన్నతులు పరిష్కరించాల్సి ఉంది.పలు విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయాల్సి ఉండగా అది జరగడం లేదు. దీంతో కార్మికులకు ఉద్యోగోన్నతి లభించడం లేదు.వారసత్వ ఉద్యోగాలకు సంబంధించి విజిలెన్సు విచారణ పేరుతో నిలిపివేసిన వారసులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాల్సి ఉంది.అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మెడికల్ ఇన్‌వాలిడేషన్ చేయడం లేదు. అలాంటి వారు చాలా మంది ఉన్నారు. వారు పనిచేయలేకపోతున్నారు.కొత్త గనుల ఏర్పాటుపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. కొత్త గనులు లేకుండా సింగరేణికి భవిష్యత్తు లేదు. దీనిపై సంఘాలు, యాజమాన్యం చర్చించాలి.పనిచేసే కార్మికులకు సరిపడా పనిముట్లు సక్రమంగా సరఫరా కావడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ అంశాలపై దృష్టి సారించాలి.

# ఆరోగ్యానికి చిరు ధాన్యం







**జగిత్యాల-నవభూమి:** ఉమ్మడి జిల్లాలో ఇటీవల కొందరు రైతులు చిరుధాన్యాల సాగును కొద్ది విస్తీర్ణంలో చేపట్టి విస్తరిస్తున్నారు. ప్రస్తుతం చిరుధాన్యాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకొని అధిక ధరకు విక్రయిస్తుండగా..సాగు పెరిగితే వినియోగదారులకు సరసమైన ధరలోనే అందుబాటులోకి వస్తాయి, రైతులకూ విక్రయ అవకాశాలు పెరుగుతాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రాగి జావ, జొన్న అంబలి, మక్క గట్క, ఉలవచారు, కొర్రల కిచిడీ, సామల ఉప్మా, జొన్న రొట్టె, పాయసం, సూప్, గుడాలు, చిరుధాన్యాల మిశ్రమపిండితో రొట్టెలు, వడ, బిర్యానీ, బజ్జీలు, కీర్, ఉప్మా, కట్లెట్, దోశ, ఇడ్లీలు తయారు చేసి విక్రయిస్తుండటం, ఇళ్లలోనూ వీటివాడకం క్రమంగా పెరుగుతోంది. వీటితో బిస్కెట్లు, మురుకులు తదితరాలను తయారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నేలలు వీటి సాగుకు అనువుగా ఉండగా యాసంగిలో పండించదగిన ఈ పంటల విత్తనాలను ప్రభుత్వం రాయితీపై ఇవ్వటం, మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తుల కొనుగోలు, ఉపఉత్పత్తుల తయారీ తదితరాలతో ప్రోత్సాహాన్ని అందించాలని కర్షకులు కోరుతున్నారు.ప్రయోజనాలు ఆలస్యంగా జీర్ణమవటంవల్ల మధుమేహ వ్యాధిగ్రస్థులకు లాభిస్తుంది.వీటిల్లో చక్కెర పదార్థాలు తక్కువగా ఉంటాయి. టైప్-2 చక్కెరవ్యాధి నిరోధానికి సాయపడతాయి.చిరుధాన్యాల్లోని మెగ్నీషియం అధిక రక్తపోటు తగ్గించటంలో ఉపకరిస్తుంది.చిరుధాన్యాల్లో ఖనిజ లవణాలు, బి-కాంప్లెక్స్ విటమిన్లు పిల్లల్లో ఎదుగుదలకు దోహదడపతాయి.పాస్పరస్ శరీర కణాల పెరుగుదలకు, నాడీవ్యవస్థ సక్రమ పనితీరుకు, పిండి పదార్థాలు శక్తిగా మారడానికి సహకరిస్తుంది.వీటిలోని నయాసిస్ అనే బి-విటమిన్ రక్తంలో చెడుకొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది.వీటిని తరచూ తీసుకోవడం వల్ల గుండెసంబంధిత వ్యాధులు తగ్గుతాయి.మూత్రపిండాలు, కాలేయం, రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేస్తాయి.పేగుసంబంధిత అల్సర్లు, క్యాన్సర్లు ఏర్పడే అవకాశాలను తగ్గిస్తాయి.మలబద్దకం, ఉబ్బసం, ఊబకాయం, తిమ్మిరివంటివి రాకుండా సహకరిస్తాయి.సామలలో ఎక్కువగా ఇనుము, ఖనిజ లవణం ఉండటంతో మహిళల్లో రక్తహీనతను నివారిస్తుంది.

## కొడుకు డబ్బులు ఇవ్వడం లేదని తల్లి కిడ్నాప్



**వేములవాడ –నవభూమి:** కొడుకు డబ్బులు ఇవ్వడం లేదని తల్లిని కిడ్నాప్ చేసిన ఘటన వేములవాడ మండలం కొడిముంజలో కలకలం రేపింది. 24 గంటల్లో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. గురువారం వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా బోధన్‌కి చెందిన పల్లపు శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం కొడిముంజ వచ్చి నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ ఇటీవల సోదరుడు శ్రీధర్‌తో కలిసి ఛత్తీస్‌గఢ్‌లో కూలీ పనికి వెళ్లాడు. ఈ క్రమంలో మహారాష్ట్రకు చెందిన గుత్తేదారు లాలూ నాగోరావు దయారంగలోడ్‌తో చెరకు పంట కోతకు కూలీలను సమకూర్చుతానని ఒప్పందం కుదుర్చుకొని రూ.3.80 లక్షలు తీసుకున్నాడు. ఒప్పందం ప్రకారం చెరకు పంట కోతకు కూలీలను సమకూర్చకపోవడంతో గుత్తేదారు శ్రీనివాస్‌ని డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగాడు. డబ్బులు ఇవ్వడంలో జాప్యం చేయడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో గుత్తేదారు తన భార్య పంచతుల, మరో నలుగురు వ్యక్తులతో కలిసి బుధవారం సాయంత్రం శ్రీనివాస్ ఇంటికి వచ్చి అతని కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. శ్రీనివాస్ ఇక్కడ లేదని చెప్పినా వినిపించుకోలేదు. శ్రీనివాస్ భార్యను తీసుకెళ్లడానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకొని పక్కింటికి వెళ్లి దాక్కోగా తల్లి భీమాబాయ్‌ని బలవంతంగా కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. భీమాబాయ్ మనవడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి ఇద్దరు నిందితులను మహారాష్ట్రలోని నాందేడ్‌లో పట్టుకొని వేములవాడ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. భీమాబాయ్‌ని కుటుంబ సభ్యులకు అప్పగించి నిందితులు నాగోరావు దయారంగలోడ్, అతని భార్య పంచతులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. మిగతా నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

## ప్రణాళిక.. అభివృద్ధికి సూచిక



**కరీంనగర్–నవభూమి:** కరీంనగర్ నగరం పట్టణాలు, నగరాలు దినదిన అభివృద్ధి చెందుతున్నాయి. ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య కోసం పల్లెల నుంచి అక్కడకు పరుగులు పెడుతున్నారు. జనాభాకుతోడు వాటి విస్తీర్ణమూ పెరుగుతూ వస్తోంది. కొత్త కాలనీలూ వెలుస్తున్నాయి. చుట్టుపక్క గ్రామాలూ విలీనమవుతున్నాయి. ఆ ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, అక్రమ కట్టడాలు తొలగించడం, నగర, పురపాలికల వీధి. ఆ బాధ్యతను పట్టణ ప్రణాళిక విభాగం చూస్తోంది. నేడు ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ.. ఎలాంటి లోపాలున్నాయి. కరీంనగర్, రామగుండం నగర పాలక సంస్థలు, పట్టణాల్లో పట్టణీకరణ పెరిగింది. గ్రామాలు పంచాయతీలుగా.. పంచాయతీలు పురపాలికలుగా హోదా పెరుగుతుండటంతో వలసలు పెరిగాయి. జనాభాకు పెరగడంతో ఎక్కడ స్థలం కనిపిస్తే చాలు అక్కడ భవనాలు వెలుస్తున్నాయి. సామాజిక అవసరాల కోసం రహదారులు, మురుగుకాలువలు, ఉద్యానవనాలు, ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటివి ఉండాలంటే బృహత్తర ప్రణాళికలు అవసరం. 20 ఏళ్లకు ఒకసారి ప్రణాళికలు అమలు కావాల్సి ఉండగా పాతికేళ్లు దాటినా ఆ ఊసే లేకుండా పోతోంది. లక్ష్యాల నిర్దేశం..పట్టణ ప్రాంతాల్లో భవిష్యత్తును రూపొందించడానికి, లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. పౌరుల జీవన పరిస్థితులను మెరుగుపర్చడానికి వసతులు కల్పించాలి. చిన్న పట్టణాలకు ఆర్థికాభివృద్ధి అందించేలా ఉంటుంది. భవన నిర్మాణాలు, పాదచారులు, పార్కులు నిర్మించుకోవడానికి వినియోగించుకునే వీలుంది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు ఇందులోకి వినియోగించుకోవచ్చు. – పట్టణాలు, నగరాల్లో రహదారి విస్తీర్ణం, పారిశ్రామిక అభివృద్ధి, పచ్చదనం పెంచుకోవడానికి అవకాశముంటుంది. మాస్టర్‌ప్లాన్ అమలు చేయడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా అన్ని రకాల ప్రణాళికలు అమల్లోకి వస్తాయి.

### సమావేశాలతోనే సరి..

# సమస్యల పరిష్కారమేది?



**వేములవాడ –నవభూమి:** మధ్యమానేరు జలాశయం వేములవాడ మండలం ఆరెపల్లికి చెందిన ఓ నిర్వాసితుడికి చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పట్టా ఇచ్చారు. ఆ స్థలంలో ఇప్పటికే ఓ కట్టడం ఉండటంతో మరో చోట కేటాయించాలని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈయన ఒక్కడే కాదు. ఇలా చాలా మంది నిర్వాసితులు సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారు. బోయినపల్లి మండలం వరదవెల్లిలో పలువురు నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూమిపై కోర్టులో కేసు ఉంది. ఈ స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి సాధ్యపడటం లేదు. నిర్వాసితులు తమ పిల్లల వివాహాలు, అత్యవసర సమయంలో ఆసుపత్రి ఖర్చుల కోసం స్థలం విక్రయించుకోవడానికి కూడా వీలు లేకుండా పోయింది. 2016 నుంచి సమస్య కొలిక్కి రావడం లేదు. అధికారులు ఇదే గ్రామంలో మరో చోట స్థలం కేటాయించకుండా తాత్సారం చేస్తున్నారు. అధికారుల పరిధిలో ఉన్న చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం కూడా నిర్వాసితులు ఏళ్లుగా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయంలో ముంపునకు గురైన నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం ఉండటం లేదు. అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నా విచారణలతోనే కాలం వెల్లదీస్తున్నారు. ఫలితంగా దశాబ్ద కాలంగా పరిహారం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లాలోని బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మధ్యమానేరు జలాశయంలో అనుపురం, కొడుముంజ, రుద్రవరం, సంకెపల్లి, చీర్లవంచ, శాభాష్‌పల్లి, చింతల్‌ఠాణా, గుర్రంవాణిపల్లి, కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. కుటుంబ పరిహారం అందించేందుకు అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి 10,683 కుటుంబాలు నిర్వాసితులుగా మారుతున్నట్లు గెజిట్ ప్రచురించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను ఏర్పాటు చేసి అర్హులైన వారికి ఒక్కొక్కరికి 242 చదరపు గజాల ఇంటి స్థలం (ప్లాట్)ను అందించడంతోపాటు నిర్వాసితుల వృత్తి ఆధారంగా కుటుంబ పరిహారం అందించారు. అయితే గెజిట్ ప్రచురించిన సమయంలో అనేక మంది నిర్వాసితుల వృత్తి తప్పుగా నమోదైంది. గ్రామంలో నివాసం ఉన్నవారి పేర్లు తప్పిపోయాయి. అధికారుల తప్పిదాలతో పరిహారానికి దూరమయ్యారు. గుర్రంవాణిపల్లిలో నిర్వాసితుల సమస్యలపై అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ పెండింగ్‌లో 3,800 దరఖాస్తులు పరిహారం అందని నిర్వాసితులు ఏళ్లుగా తమకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాలతోపాటు ప్రజావాణిలో దరఖాస్తులు ఇస్తూనే ఉన్నారు. గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లోనూ అధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకొని దరఖాస్తులు ఇచ్చారు. కుటుంబ పరిహారం, ఇళ్లు, ఇంటి అడుగు స్థలం, భూములకు, యువతీ, యువకుల పరిహారం, తప్పిపోయినవారి పేర్లు నమోదు ఇలా వివిధ రకాల సమస్యలతో దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 3,800 దరఖాస్తులు అందాయి. ఇప్పటి వరకు వీటిపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించడం లేదు. ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ సమస్యలు కొలిక్కి రావడం లేదు. చర్యలు తీసుకుంటున్నాం రాజేశ్వర్, ఆర్డీవో, వేములవాడ మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తున్నాం. దరఖాస్తులపై విచారణ కొనసాగుతుంది. అర్హులైన నిర్వాసితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మా పరిధిలో పరిష్కారమయ్యే వాటిని జిల్లా అధికారుల అనుమతితో పరిష్కరిస్తాం.

# బస్సెక్కాలంటే బలం చూపాల్సిందే!

**సిరిసిల్ల–నవభూమి:** జిల్లాలో కార్మిక, ధార్మిక క్షేత్రాలు ఉండటంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగుతున్నాయి. మరోవైపు జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరవాత సిరిసిల్లకు వచ్చిపోయేవారు భారీగా పెరిగారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను పెంచడం లేదు. ప్రయాణ ప్రాంగణంలో ఏ ప్లాట్‌ఫారం చూసినా ప్రయాణికులతో కిటకిటలాడుతుంది. ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజలు కలెక్టరేట్‌తోపాటు వివిధ పనుల కోసం జిల్లా కేంద్రానికి తరచూ వస్తుంటారు. అత్యధిక మంది బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా దసరా, దీపావళి ఇలా వివిధ పండగల సమయంలో ఎక్కువగా స్వగ్రామాలకు వచ్చిపోతుంటారు. బస్సులు చాలక గంటల తరబడి ప్రయాణికులు ప్రయాణ ప్రాంగణంలో నిరీక్షించాల్సి వస్తుంది. జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం ఉండటంతో ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు రోజూ జిల్లా కేంద్రం మీదుగా భారీగా సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. సిరిసిల్ల కార్మిక క్షేత్రం కావడంతో పట్టణానికి మహారాష్ట్ర, సోలాపూర్, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వస్త్రోత్పత్తిదారులు ఆర్డర్ల కోసం వస్తారు. దీంతో బస్సులు సరిపోక నానా పాట్లు పడుతున్నారు. బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తూ...డిపోలో ఆర్టీసీ బస్సుల సంఖ్య: 71 అద్దె బస్సులు: 24 గ్రామీణ ప్రాంతాలకు కేటాయించినవి: 24 గురుకుల, ఆదర్శ పాఠశాలలకు: 4 ఎక్స్‌ప్రెస్‌లు: 31 డీలక్స్: 12 రోజూ ప్రయాణిస్తున్నవారి సంఖ్య: 33 వేలు సిరిసిల్ల డిపోలో ఉద్యోగులు: 400 పొరుగుసేవలో పని చేసేవారు: 30 ఒక బస్సు సామర్థ్యం: 55 మంది ప్రయాణిస్తున్నది : 100 మంది డిపోకు రోజు వారి ఆదాయం: రూ.16 లక్షలు జీరో టికెట్‌లకు ప్రభుత్వం చెల్లిస్తున్నది: రూ. 8 లక్షలు డిపోలో డ్రైవర్ల కొరత: 15 ఇబ్బందులు లేకుండా చూడాలి రాణి, ప్రయాణికురాలు నేను బస్సు కోసం గంటల తరబడి ఎదురు చూస్తున్నాను. ప్రతి బస్సులో 50 మంది వెళ్లాల్సి ఉండగా 100 మంది ఉంటున్నారు. దీంతో మరో బస్సు కోసం చూస్తున్నాం. బస్సుల సంఖ్య పెంచి ఇబ్బందులు కలగకుండా చూడాలి. సంఖ్య పెంచాలి వంశీ, ప్రయాణికుడు నేను హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు కోసం గంటల తరబడి ఎదురు చూస్తున్నాను. వేములవాడ నుంచి వస్తున్న బస్సులు పూర్తిగా నిండి వస్తున్నాయి. దీనితో మరో బస్సు కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. బస్సుల సంఖ్య పెంచాలి. ప్రతీ గ్రామానికి తిప్పుతున్నాం ప్రకాశ్‌రావు, డీఎం ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వారికి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. జిల్లా కేంద్రం నుంచి ప్రతి గ్రామానికి బస్సులు తిప్పుతున్నాం. ఏమైనా సమస్యలు ఉంటే ప్రయాణికులు కోరిన వెంటనే బస్సులు పంపిస్తాం. ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం వల్ల సంస్థకు ఆదాయం పెరుగుతుంది. అదేవిధంగా ప్రమాదాల నివారణకు ఆస్కారం ఉంటుంది.



